క్లుప్తంగా

మాజీ సైనికుల విరాళం


డీడీని అందజేస్తున్న సుకుమార్, రెడ్డెప్ప

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత సైనికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.25 వేలు విరాళం అందజేశారు. బుధవారం అసోసియేషన్ నాయకులు సుకుమార్, రెడ్డెప్ప, జవహర్, వేణుగోపాల్ విరాళ డీడీని తహసీల్దార్ రాముకు అందజేశారు. బాధితులకు తమ వంతు సహాయంగా పంపాలని కోరారు.

సచివాలయాల తనిఖీ


సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట, అమ్మరాజుపల్లె, లింగాపురం సచివాలయాలను ఎంపీడీఓ కేఎస్.బాలాజి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, రికార్డుల నిర్వహణ, కార్యాలయాల పరిశుభ్రత తదితరాలను పరిశీలించారు. హాజరు పట్టిక, మూవ్‌మెంట్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, అందరూ సమయ పాలన పాటించాలని ఆదేశించారు. అలాగే, మంగళవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శంకర్రాయలపేట సచివాలయాన్ని తనిఖీ చేసినప్పుడు సిబ్బంది లేకపోవడంపై ఆరా తీశారు.

ఆకుకూరలతో ఆరోగ్యం


గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న మహతి ఫౌండేషన్ నిర్వాహకులు, వైద్యాధికారి

బైరెడ్డిపల్లి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఆకుకూరలు తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. మహతి ఫౌండేషన్ సహకారంతో గర్భవతులకు బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ఆకుకూరల్లో విటమిన్లు, లవణాలు, మాంసకృతులు, పీచుపదార్థాలు పుష్కలంగా ఉంటాయన్నారు. నెలలు నిండే వరకూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యాధికారుల సలహాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ నిర్వాహకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాళిబొట్లు సమర్పణ


తాళిబొట్లను సమర్పిస్తున్న ఆనందాచార్యుల దంపతులు

చౌడేపల్లి: మండలంలోని ఏ.కొత్తకోట పంచాయతీ ఎస్ అగ్రహారం గ్రామంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారికి ఆనందాచార్యులు, చాముండేశ్వరి దంపతులు తాళిబొట్లను సమర్పించారు. బుధవారం ఆలయం వద్ద గ్రామస్తులతో కలిసి తాళిబొట్లను అర్చకులకు అందజేశారు. వాటికి ప్రత్యేక పూజలు చేశారు.

చిరుత కాదు.. రేచుకుక్క పాదముద్రలు


వన్యప్రాణి పాదముద్రలు గుర్తిస్తున్న అటవీ అధికారులు

సదుం: మండలంలోని నడిగడ్డలో చిరుత సంచారం అంటూ వదంతులు వ్యాపించడంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహేష్, ట్రాకర్ రమణయ్య నడిగడ్డలో పర్యటించారు. వన్యప్రాణి పాదముద్రలను పరిశీలించారు. అవి చిరుత పాదముద్రలు కావని.. రేచుకుక్క లేదా అడవిపిల్లిది అయిఉండవచ్చని తేల్చి చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

'బాస్' నూతన కార్యవర్గం ఎంపిక


రూపేష్

పలమనేరు: పలమనేరు బాస్ (బలిజ అభ్యుదత సేవా సంఘం)నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక పీజేసీ కల్యాణ మండపంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సుధాకర్, అధ్యక్షుడిగా రూపేష్, ఉపాధ్యక్షులుగా చంద్ర, కిరణ్‌కుమార్, అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా దైవప్రసాద్, కోశాధికారిగా చెంచురెడ్డి రాయల్, సంయుక్త కార్యదర్శులుగా జనార్దన్, హేమంత్, కోటేశ్వర్లు, పీఆర్వోగా శ్యామ్, అలాగే కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పలువురు బాస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీ వర్సెస్ ఓసీ

చిత్తూరు జిల్లాలో పేరొందిన ప్రముఖ పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం ఇప్పుడు టీడీపీ నేతల రాజకీయాలకు కేంద్రబిందువవుతోంది. చైర్మన్ పదవి బీసీలకా, ఓసీలకా? అనే విషయమై నాయకుల మధ్య నెలకొన్న పోటీ, ఎవరికి వారే ప్రచారం, విమర్శలు..వెరసి కుమ్ములాటలు, విభేదాలు బట్టబయలయ్యాయి.

- రసకందాయంలో బోయకొండ ఆలయ చైర్మన్ పదవి
- రేసులో వెంకటముని, రమణారెడ్డి
- ఎస్కే విమర్శలతో హీటెక్కిన రాజకీయం


బోయకొండ ఆలయం


వెంకటమునియాదవ్


రమణారెడ్డి

పుంగనూరు: బీసీల సామాజిక వర్గానికి చెందిన ఆలయంగా ప్రసిద్ధిగాంచిన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయ చైర్మన్ పదవికి బీసీ, ఓసీలలో పోటీ తీవ్రమైంది. అధికార పార్టీ ఓసీల వైపు మొగ్గు చూపుతుండటంతో బీసీలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. అధికార పార్టీకి తమ సత్తా ఏమిటో చాటేందుకు సిద్ధమవుతున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి అండగా, ఎలాంటి పదవులు ఆశించని యాదవ కులానికి చెందిన సీనియర్ న్యాయవాది వెంకటముని యాదవ్‌కు చైర్మన్ పదవి ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు, లోకేష్, ఇన్‌చార్జ్ చల్లాబాబు అంగీకరించినట్లు పుంగనూరు నియోజకవర్గంలోని యాదవ సామాజిక వర్గం పేర్కొంటోంది. ఇతర వర్గాలు కూడా వెంకట మునియాదవ్‌కే మద్దతు ఇచ్చినట్లు సమచారం. అయితే నెల రోజులుగా ఓసీ సామాజిక వర్గానికి చెందిన బెంగళూరు వాసి లక్ష్మీపతిరాజు బోయకొండ చైర్మన్ పదవి లేదా టీటీడీ పాలక మండలి సభ్యుడి పదవి తనకేనంటూ సామాజిక మాధ్యమాల్లో , పచ్చ మీడియాలో సొంత బాకా ఊదుతున్నారు. ఎక్కడికి వెళ్లినా ఆయన తన గురించే ఇలా బిల్డప్ ఇస్తూ, ఇక్కడ పాగా వేసేందుకు పావులు కదుపుతుండడంతో పార్టీ క్యాడర్‌లో విభేదాలు పొడచూపాయి. ఆయన తీరుపై పలువురు చంద్రబాబుకు, లోకేష్‌కు ఫిర్యాదు చేయడంతో అధిష్టానం సీరియస్‌గా తీసుకుని లక్ష్మీపతిరాజును హెచ్చరించినట్లు సమాచారం. నియోజకవర్గంలో పార్టీ కోసం 35 ఏళ్లుగా పని చేస్తున్న వారిని కాదని, కొత్తవారికి నామినేటెడ్ పదవులు ఇచ్చే ప్రసక్తే లేదని అధిష్టానం స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో బీసీలకే బోయకొండ చైర్మన్ పదవి తప్పదని ఆ సామాజిక వర్గీయులు సంబరపడ్డారు. అయితే మంగళవారం బోయకొండ వద్ద చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు పదవుల రేసును మరింత హీటెక్కించాయి. ఆలయ మాజీ చైర్మన్ ఎస్‌కె.రమణారెడ్డి తన భార్య రతీదేవితో ఆలయాన్ని సందర్శించారు. అంతవరకూ బాగానే ఉన్నప్పటికీ ఆలయంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, స్థానిక తెలుగుదేశం నాయకులు రౌడీయిజం చేస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో విమర్శించి కలకలం రేపారు. తాను చైర్మన్‌గా వస్తానని, వీటన్నిటికీ ముగింపు పలుకుతానని ఆయన ప్రకటించడం చర్చనీయాంశమైంది. అంతేకాకుండా బోయకొండ ఆలయ చైర్మన్ పదవి ఓసీలకు ఖరారైనట్లు ప్రచారం ప్రారంభమైంది. దీనిపై బీసీలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. బోయకొండ చరిత్రలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒకసారి బీసీ కులస్తుడైన మిద్దింటి శంకరనారాయణకు చైర్మన్ పదవి ఇచ్చింది. అంతకు ముందు తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాలు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి చైర్మన్ పదవులు ఇచ్చాయి. ప్రస్తుతం ఎస్‌కె.రాకతో బోయకొండ చైర్మన్ పదవి ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కింది. బీసీలను కాదని ఓసీలకు కేటాయిస్తే బీసీలలో తిరుగుబాటు తప్పదని పలువురు బీసీలు బహిరంగంగా హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది. బీసీలకు కట్టబెడుతుందా? ఓసీలకు కట్టబెడుతుందా? అనే చర్చ సాగుతోంది.

అవులా.. దేవు అయిలా..!


షికారీలకు నమస్కరిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- షికారీ మహిళల ఆనందోత్సాహం
- పెద్దిరెడ్డికి హారతులిచ్చి స్వాగతం


పెద్దిరెడ్డికి హారతి ఇస్తున్న యాదవ మహిళలు

చౌడేపల్లి: అవులా..అవులా...దేవు అయిలా..(రండి..రండి..మన స్వామి వచ్చారు..) జగన్‌కు జైబోలో..అంటూ షికారీ మహిళల ఆనందోత్సాహాలకు అంతులేకుండా పోయింది. బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సమేతంగా బోయకొండ గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించడానికి వస్తున్నారని తెలుసుకున్న షికారీ మహిళలు షికారిపాళ్యం క్రాస్ వద్దకు వచ్చారు. వారిని చూసి పెద్దిరెడ్డి కారు దిగి ఆప్యాయంగా పలకరించారు. దిగువపల్లె సర్పంచ్ సోని, షికారీలతో ముచ్చటించారు. పలువురు ఆయనతో సెల్ఫీల కోసం ఉత్సాహం చూపారు. చౌడేపల్లె నుంచి బోయకొండ వరకు ప్రతి స్టేజిలోనూ మహిళలు, పార్టీనేతలు పెద్దిరెడ్డికి ఘనస్వాగతం పలికారు. వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆయన బోయకొండకు వెళ్లారు.

రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోండి


చిన్నారిదొడ్డి వద్ద రైతులతో అధికారులు

శాంతిపురం: తమ శాఖ ఇచ్చే రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని కర్లగట్ట, చిన్నారిదొడ్డిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రైతులు తమ ఉత్పత్తులను గ్రేడింగ్ చేసుకోవడానికి, ఇతర అవసరాలకు ప్యాక్ హౌస్‌ను నిర్మించుకుంటే రూ 2 లక్షల రాయితీ వర్తిస్తుందని చెప్పారు. హెక్టారు విస్తీర్ణంలో మల్చింగ్ షీట్ వేసుకోవడానికి రూ.16 వేలు, పూలసాగుకు రూ.16వేలు, తీగ జాతి పంటల సాగుకు రూ.20 వేలు రాయితీ ఇస్తామన్నారు. ప్యాక్ హౌస్‌ల నిర్మాణానికి 50 శాతం రాయితీ ఉందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం చేస్తే కలిగే లాభాలను వ్యవసాయాధికారి అప్పోజీ వివరించారు. కార్యక్రమంలో అధికారులు మనోజ్‌కుమార్, వింధ్య, నరసింహులు, వినయ్ పాల్గొన్నారు.

వివాదంపై అధికారుల విచారణ


గ్రామస్తుల అభిప్రాయం తెలుసుకుంటున్న అధికారులు

సదుం: మండలంలోని కలకటవారిపల్లెలో అంబేడ్కర్ విగ్రహం స్థల మార్పుపై గ్రామంలో ఇరువర్గాల మధ్య కొంతకాలంగా వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సమస్య పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ క్రమంలో బుధవారం గ్రామంలో తహసీల్దార్ హుస్సేన్, ఎస్‌ఐ షేక్‌షావలి గ్రామస్తులకు సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ హరిబాబు, గ్రామస్తులు, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

కుప్పం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- త్వరలో గ్రీవెన్స్ కాల్ సెంటర్ ఏర్పాటు
- ప్రతి పంచాయతీలో ప్రజా దర్బార్*
- కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ వెల్లడి



కుప్పం: కుప్పం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పేదరికం లేని కుప్పంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి పనులపై సీఎం ఆదేశాల మేరకు విజన్ డాక్యుమెంట్ తయారు చేశామన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 15 వేల మరుగుదొడ్లు మంజూరు చేశామని, ప్రతి ఇంటికి మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నవంబర్ 20 తేదీ లోపు హౌసింగ్, పింఛన్ల సర్వే పూర్తి చేస్తామన్నారు. త్వరలో గ్రీవెన్స్ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి, ప్రజా దర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతి పంచాయతీలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని అన్ని ప్రభుత్వ శాఖ అధికారులతో ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు. కుప్పం టూరిజం హోటల్‌ను జనవరిలో ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు జాతీయస్థాయి పద్యాల పోటీలు

పలమనేరు: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 12వ వార్షికోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు జాతీయస్థాయిలో పద్యాల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వందకుపైగా పద్యాలను చెప్పగలిగిన పిల్లలు ఈనెల 20వ తేదీ లోపు 9346249011 నంబరుకు కాల్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఇందులో ఎంపిక చేసిన 50 మందికి ఈ నెల 27న పలమనేరులో జరిగే వార్షికోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తామని తెలియజేశారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత


మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ యువరాజు సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు ఆహ్వానం, బదిలీపై వెళుతున్న అధికారులకు వీడ్కోలు కార్యక్రమం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. వీ.కోట ఎంపీడీఓ మహ్మద్‌రఫీ బదిలీపై పిచ్చాటూరుకు వెళ్లారు. ఆయన స్థానంలో శాంతిపురం ఈఓ ఆర్‌డీ ఈశ్వర్‌కు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. అలాగే బైరెడ్డిపల్లె ఏఓ శంకర్‌బాబు వి.కోటకు బదిలీపై వచ్చారు. స్వాగత, వీడ్కోలు కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడారు. మండలంలో ప్రధానంగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీని పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, డీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ గోపిరెడ్డి, భక్తవత్సలం, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నపిల్లలను పనులకు వినియోగిస్తే కేసులు



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ మధుబాబు, రాజేశ్వరి తదితరులు


రొంపిచెర్ల: అవగాహన కల్పిస్తున్న పోలీసులు, సంస్థ ప్రతినిధులు

పుంగనూరు: చిన్నపిల్లలను పనులకు వినియోగించరాదని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి పనులు చేయిస్తే కేసులు తప్పవని లేబర్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు హెచ్చరించారు. బుధవారం పట్టణంలో ఐసీడీఎస్ ఏపీఓ రాజేశ్వరితో కలసి దుకాణదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, చిన్నపిల్లలను హోటళ్లు, దుకాణాలు, వెల్డింగ్‌షాపులు, బట్టీలలో పనిలో పెట్టుకుంటున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, పనుల్లో బాలలు ఉన్నట్టు తేలితే కేసులు, జరిమానా తప్పదన్నారు. అంతేకాకుండా దుకాణాల లైసెన్సులను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.

బాల కార్మికులతో పని చేయించడం నేరం

రొంపిచెర్ల: బాలలతో పని చేయించడం నేరమని రొంపిచెర్ల ఏఎస్‌ఐ మధుసూదన్ అన్నారు. ఆపరేషన్ స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా బుధవారం రొంపిచెర్లలో బాల కార్మిక వ్యవస్థ రూపుమాపాలని కోరుతూ గ్రేట్ విజన్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ మాట్లాడుతూ, బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. బాలలతో పని చేయిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని, అలాగే రూ.10 వేలు జరిమానా, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను బడికి పంపాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జీవీఎస్ బాబు, రఘునాథ్, ఓబులేసు పాల్గొన్నారు.






పుంగనూరు: పత్తితో అలంకృతురాలైన విరూపాక్షి మారెమ్మ, ప్రత్యేకాలంకారంలో సదుమమ్మ, పలమనేరు: బసవన్న, శివాలయాల్లో.., రొంపిచెర్లలో..

హోమియో వైద్య శిబిరానికి స్పందన


మాట్లాడుతున్న డాక్టర్ మధుసూదనాచారి

పుంగనూరు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఏరియా ఆసుపత్రి మెడికలాఫీసర్ మధుసూదనాచారి కోరారు. బుధవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో హోమియో వైద్య శిబిరాన్ని హోమియో ఇన్‌చార్జ్ నాగేనాయక్ నిర్వహించారు. రోగులను పరీక్షించి 525 మందికి హోమియో మందులు పంపిణీ చేసి మాట్లాడారు. హోమియో మందులతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, వీటితో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, సంఘ సభ్యులు బాబు, సురేష్, రంగన్న, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వీణాధారిగా గంగమ్మ



పుంగనూరు: సరస్వతిదేవి అలంకారంలో పార్వతిదేవి, బోయకొండ అమ్మవారు

చౌడేపల్లి: చదువుల తల్లి సరస్వతీదేవి అలంకారంలో బోయకొండ గంగమ్మ భక్తులకు దర్శనమిచ్చింది. దసరా మహోత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన బుధవారం అమ్మవారిని వేద పండితులు గోవర్ధన శర్మ, విశ్వనాథశర్మ వీణాధారిగా అలంకరించి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని శ్రీభోగనంజుండేశ్వర స్వామి ఆలయంలో శ్రీపార్వతిదేవి, శ్రీవిరూపాక్షి మారెమ్మను ప్రత్యేకంగా పత్తితో అలంకరించారు. అలాగే బజారువీధిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవిని, తూర్పుమొగసాలలో శ్రీచాముండేశ్వరిదేవిని సరస్వతిదేవి అలంకారంలో కొలువుదీర్చి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సదుంలో..

సదుం: స్థానిక సదుమమ్మ ఆలయంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జాండ్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి, రెడ్డివారిపల్లె చామంతుల ఎల్లమ్మ, పచ్చార్ల మాకుల పల్లె గంగాపురెమ్మ ఆలయాలలో పూజలు, విశేష అలంకారాలు చేశారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని ముత్యాలమ్మ బుధవారం సరస్వతిదేవి అలంకరణలో కొలువుతీరారు. అమ్మవారిని పూజల మాలలు, బంగారు, వెండి నగలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజార్చనలు చేశారు.


బైరెడ్డిపల్లె: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

సరస్వతిదేవీ అలంకారంలో దుర్గాదేవి

పలమనేరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని నక్కపల్లె బోయకొండ గంగమ్మ ఆలయం, పట్టణంలోని పాతపేట దుర్గమ్మ, కొత్తపేట బసవన్న, శివాలయాల్లో బుధవారం దుర్గాదేవి చదువుల తల్లి సరస్వతీదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మేలుమాయి క్రాస్ వద్ద..

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద ఉన్న శ్రీమలాలమ్మ బుధవారం ధైర్యలక్ష్మి అవతారంలోకి భక్తులను అనుగ్రహించారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని శ్రీ సల్లాపురెమ్మ ఆలయం, బాటగంగమ్మ ఆలయం, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో బుధవారం అమ్మవార్లు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తీర్థంలోని శ్రీ రామచంద్రస్వామి ఆలయంలో సీతారామ లక్ష్మణ కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలలో మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్



ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్, మీనాక్షి దేవిగా దుర్గామాత

వి.కోట: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక దుర్గామాత మీనాక్షి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి పూజార్చనలు చేశారు. వారికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో గడపాలని మొక్కినట్లు చెప్పారు. ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ లక్ష్మమణ్ ఆలయ చైర్మన్ దామోదరం, నాయకులు గోపిరెడ్డి, రమేష్, పూలనాగ పాల్గొన్నారు.

అధికారులకు సిగ్గుచేటు..!

- సమస్యపై స్పందించని వైనం
- విసిగి వేసారి తానే

గుంతలు పూడ్చివేసిన ఓ సామాన్యుడు


రోడ్డుపై గుంతలు పూడ్చివేసిన రైతు గోపాల్

పుంగనూరు: పట్టణంలోని ఎన్ఎస్.పేటకు వెళ్లే రహదారి గుంతలమయమైంది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో ఆ ప్రాంతానికి చెందిన గోపాల్ అనే రైతు బుధవారం తన సొంత ఖర్చుతో ట్రాక్టర్ల ద్వారా స్టోన్ క్రషర్ రాతి దుమ్మును తరలించి, గుంతలు పూడ్చివేశారు. ఇందుకోసం పదివేల రూపాయల వరకు వ్యయం చేశాడు. ప్రభుత్వం చేయాల్సిన పనులు సామాన్య రైతు చేయడంతో ఆ ప్రాంత వాసులు, వివిధ సంఘాల నాయకులు అభినందించారు.